# అలసిన రెక్కలు

గోమాతలా కనిపించే అరవై రెండేళ్ళ లక్ష్మి ఇల్లూడ్చుకుంటూ మళ్ళీ ఓసారి భర్త కనకయ్య దిక్కు చూసింది.

ఎంతో ఓపిగ్గా ఇంకా అతనాపనే చేస్తున్నాడు ...దీక్షగా.

'ఎందుకో ఈయాల మనిషి గిట్లున్నడు. మొకం జూస్తె కదిలిస్తె దుఃఖమస్తదా అనిపిస్తోంది' అనుకుని, చీపురును గోడవార ఆనించి, లైటేసి మళ్ళీ బీడీల చాటను ఒళ్ళో పెట్టుకుంది.

కనకయ్య లేచి లోపలికెల్లి గ్యాసునూనె పీసా తెచ్చి లాంతరు నిండా పోసి, ఎక్క తుడిచి, వత్తి ఎక్కించి యిక వెలిగిద్దామని అగ్గిపుల్ల గీయగానే రివ్వున వీచిన గాలి విసురుకు ఆరిపోయింది. నెమ్మదిగా అరుగుపై నుంచి కొద్దిగా ముందుకు వంగి నుదుటిపై చేయి ఆనించి నింగికేసిచూచి "నీయవ్వ వానచ్చేటట్టున్నదే" అన్నాడు స్వగతంగా.

"ఔనని—అప్పట్నుంచి సూత్తాన. ఎందుకు ముట్టిత్తానట్టు నువ్విగా లాంతరును. యింట్ల కరంటు లైటుండంగ లాంతరెందుకు—" అంది లక్ష్మి.

కనకయ్య మాట్లాడలేదు. మౌనం నిండిన చూపులతో భార్య కళ్ళలోకి చూశాడు. చూచి, మళ్ళీ ఓ అగ్గిపుల్లను గీసి లాంతరును వెలిగించి, ఎక్క పెట్టి వత్తిని ఎక్కిస్తూ...

ఎర్రని కాంతి ముడతలు పడ్డ అతని ముఖంపై బడి...

"ఎన్ని కష్టాలు పడ్డడు. ఎన్ని పనులు చేసిండు. బండలు మోసె. బండి కొట్టె. బట్టలు నేసె. బతుకుకంత రెక్కలను ముక్కలు చేసుకుని...పిల్లలను పెట్ట రెక్కల కింద దాచి పెంచినట్టు పెంచి...యిప్పుడెక్కడోళ్ళక్కడబోయి—ఏం మిగిలింది...ఎలితి..ఒట్టి ఎలితి. తలుచుకుంటే గుండెల్దెగి గొంతులకచ్చే ఎలితి...కాని మొగోడు. కష్టపడ్డా వడ్డడు. కర్సు పెట్టినా పెట్టిండు. వల్లుర్లోని సెబాసని పెచ్చుకున్నడు..." లక్ష్మి మనసు కనకయ్య ముఖాన్ని చదువుతోంది.

చటుక్కున ఎక్కడో బిగ్గరగా ఉరిమి—అతను లాంతరును చేతిలో పట్టుకుని లేచి నిలబడి ఆమె దగ్గరకు పోదామనుకునేంతలోనే టపటపా చినుకులు ప్రారంభమై అరుగుపైకి చొచ్చుకొచ్చేయి.

గాలి...వాన..జల్లు..చిక్కగా చీకటి.

మెరుపులు...ఉండి ఉండి ఉరుములు.

"యీ వాతావర్నం జూత్తాంటే బతుకు గ్యాపకమత్తాంది. వానలు, ఉరుములు మెరుపులే జీవితమంతా—"

లాంతరుని తెచ్చి ఆమె బీడీల చాట పక్కన పెట్టి బనీను జేబులోనుండి ఓ బీడీ తీసి నోట్లో పెట్టుకుని అగ్గిపుల్ల గీశాడు.

"రోజూ కస్సకస్స దగ్గుకుంట మళ్ళీ గా దిక్కుమాలిన బీడీ లెందుకు తాగుతవు. బంద్ చెయ్యరాదు. ఆగు వాడైతెరాని చెప్త—"

"పుర్రెకు బుట్టిన బుద్ధి—యిగేం బోద్ది గని..."



బీడీ అంటించే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు.

ఆమె కత్తిరించిన తునికి ఆకులో పొగాకు వేసి చకచకా చుట్టి దారం కట్టి బీడీలను చేస్తూనే ఉంది.

ప్రక్కన చాటలో అప్పటికే తయారైన బీడీలు కుప్పలుగా ఉన్నాయి.

బీడీ వెలగ్గానే ఓ దమ్మును గుండెలనిండా లాగి.. కాళ్ళను మునగదీసుకుని కూర్చున్నాడు కనకయ్య.

వర్షం ముదురుతోంది.

ఎడతెగని చినుకుల చప్పుడు నిద్రపోయిన జ్ఞాపకాలను తట్టి లేపుతున్నాయి.

కళ్ళు లాంతరులోని మంటలోనుండి మరో లోకాన్ని చూస్తున్నాయి.

వలభై మూడేళ్ళకు పైగా తన చేతిలో ఉంటూ—దారి చూపి...అలసిపోయిన ఆ మకిలి లాంతరువైపు ఆప్యాయంగా చూస్తున్న కనకయ్య మనసులో—

వర్షం కురుస్తోంది.

వెళ్ళిపోతున్నాడు కాలంలోకి...కష్టాల్లోకి...కన్నీళ్ళలోకి...జీవితంలోకి—

* * * * * *

ఆరోజు రాత్రికూడా యింతే. ఎడతెగని ముసురు మూడురోజుల నుండి. 'బి'షిఫ్ట్ ఐపోయి—యిక యింటికి పోయేందుకు సిద్ధపడ్తూ—

"ఓ రాయమల్లూ నేనీ కడకండె ఒడగొడ్తగని—నువ్వీలోగ నాది, నీది లాంతర్లు ముట్టియ్యిర. యిగ పోదాం" అన్నాడు కనకయ్య గడగడలాడుత్ను తవ లూం దిక్కు చూచుకుంటూ—తన ప్రక్కనున్న స్నేహితున్నుద్దేశించి.

రాత్రి పదకొండు కావస్తోంది. సి—షిఫ్ట్ కార్మికులు డ్యూటీకి వస్తున్నారు. 'కప్డా కాతా' మగ్గాల గడబిడతో ఎప్పుడూ ఉన్నట్లే రణరంగంలా ఉంది.

కనకయ్య మనసు ఎందుకో యింటిదిక్కు మళ్ళింది. మధ్యాహ్నం వచ్చేటప్పుడు భార్య చెప్పింది. తొందరగా రమ్మని. పొట్టతోని ఉన్న మనిషి అలా చెప్తే కనకయ్యకు ఒళ్ళు పులకరించే ఆలోచన మనసులో మెదిలి ఉక్కిరిబిక్కిరైపోయాడు.

రాయమల్లు లాంతర్లు వెలిగించాడు. సి—షిఫ్ట్

—రామాచంద్రమౌళి



బంగారమే!

"నువ్వు మాసిన అమ్మాయి బంగారు తీగలా వుంటుందా!" పెళ్ళి చూపులకు వెళ్ళొచ్చిన తన మిత్రుణ్ణి ఒకతను అడిగాడు.
"బంగారు తీగేం ఖర్మ! ఒయివెళ్లా బంగారమే"! నవ్వుతూ చెప్పుకోయినా అన్నాడు పె.కొ.మిత్రుడు.

—ప్రియదర్శిని

వెంకటాద్రి రాగానే 'సాంచ' అప్పజెప్పి, కాళ్ళు చేతులు కడుక్కున్ని వచ్చి యిక బయలుదేరుదామనుకుం టూండగానే యాదగిరి పరుగు పరుగున వచ్చి "కన్కన్నా. నీ పెళ్ళాం నొప్పులతోనుందట. నా పెళ్ళాం అర్జంటుగ నీకు చెప్పమన్నది. పోత పోత మంగలి లచ్చమ్మను తోల్కపో"అన్నాడు.

బయట కుండపోతగ వర్షం కురుస్తూనే ఉంది.

యిక చెప్పులు తొడుక్కొని బయటికి వద్దామను కునేంతలో "ఆ.."అని ఓ కేక వినబడి—

కనకయ్య, రాయమల్లు, యాదగిరి..అందరూ పరుగెత్తి...

"జోటు విరిగిపడి కుప్పకూలిపోయింది కంట్లో. గుడ్డు చితికిందో ఏందో..."

"ఎవరు...ఎవరది"

"ఏమో."

గుంపు..ఒకరిపై ఒకరు తోసుకుంటు జనం..

"అరె...మెట్రాములురా"

"మనోడే..ఓరి మెట్రాములా...యిప్పుడీడనే ఉంటివిగదరా..ఓరి దేవుడా" కనకయ్య వంగి మనిషి తలను ఒళ్ళో పెట్టుకున్నాడు. రక్తం వరదలా కారు తోంది కంట్లోనుండి.

పట్కపాండ్లే..పట్కపాండ్లి దవాఖానకు"

"పా..పద పద.."

మనిషొక చెయ్యేసి—కదులు తున్నారు.

కన్ను చితికిన మెట్టురాములు స్పృహ తప్పిపోయా డు. వర్షంలో...రాత్రి మనిషిని ఎక్కడికి తీసుకుపోవాలో తెలియక జనం తికమకలాడుతున్నారు.

తర్వాత ఎప్పుడో కాతా దొర వచ్చి—టాంగా తెప్పించి, కంపెనీ దవాఖానకు పంపి..

"రేపుదయం గాంధి దవాఖానకు తీస్కపోవాలె.. ఈయనిట్ల చెప్పండి యాక్సిడెంటయిందని.."అని డాక్టరంటే, స్నేహితున్ని విడిచిపోలేక పోలేక రాత్రి రెండుగంటలకు వానలో బయలుదేరి మొదలు మెట్రా ములు యింట్లో విషయం చెప్పి...వెంటనే బావురు మన్న అందర్నీ ఊరడించి—

అప్పుడు భార్య సంగతీ, మంగలి లచ్చమ్మ సంగతీ జ్ఞాపకమొచ్చి—

వానలో—లాంతరతో ఉయికొచ్చి ఉరుకొచ్చి, యింట్లోకి రాగానే — అంతా నిశ్శబ్దం.

ఏం జరిగిందో—

తలుపు తీసిన యింటిప్రక్క ఈరమ్మ "ఏంరా తమ్ముడా...నీకేంజెప్పి పంపిన. ఎప్పుడచ్చినా. గిట్లనే ఉంటదా..."అని దీర్ఘాలు తీసి.."పోపో..లోపలికి పో.. పిల్లగాడు పుట్టిండు పండోగ్లె. సూడుపో"అన్న రాత్రి.,

గదిలోపలికి అడుగు పెట్టగానే బుడ్డిదీపం వెలుగుల్లో పిల్లాడిని అక్కున జేర్చుకుని కనిపించిన భార్య చిర్న వ్వుతో చూచిన చూపు,

...ప్రాణాన్నిచ్చే జ్ఞాపకం.

"యింగో—యిదివరకే పిల్లగాడు పుట్టిపోయిండు గద. వీనికి భిక్షపతని పేరు పెట్టుకో బాగుంటది" బయటినుండి ఈరమ్మ.,

నిజాంకాలం నాటి ఆ రాత్రి తామిద్దరు ముగ్గురై...

తర్వాత—

మరొకడు..మరొకడు...నలుగురు మగాళ్ళు.. యిద్దరమ్మాయిలు,

అవిశ్రాంతంగా పనిచేయాల్సిన రెక్కలు,

సంసారం బండికి...తనో ఎద్దు...ఆమె మరోఎద్దు. కష్టాలు, కన్నీళ్ళు, సుఖాలు, చారుమెతుకులు — అన్నీ సమానమే.

ఆమె బీడీలు చేయాలి. తను బట్టల మిల్లులో 'సాంచా'లు నడపాలి.

లేబర్ క్లాస్ — 'పని చేసేవెందుకురా. మంచిగ కడుపు నిండ తిని తాగి తందనాలాడా'లని చెప్పేనీతి. చుట్టూ అదే వాతావరణం.

'వీడు కూలీ. వీని తండ్రి కూలే.. రేపు వీని కొడుకు కూలే'

కనకయ్య మెదడులో ఆలోచనలు మండేవి.

తన కొడుకులు కూలీలు కాకూడదు.

అందుకే మొట్టమొదటిసారిగా—ఆ వాడ నుండి తన పెద్దకొడుక్కు బడి దారి చూపించాడు.

పిల్లవాన్ని బడిలో చేర్పించిన రోజుకూడా—యిదే వాన.

* * * * * * * *

"ఎంటాలోచిస్తానౌ అప్పట్నుంచి" అంది లక్ష్మి కనకయ్య ఎదుట ఉన్న లాంతరు భగభగ మందు తూంటే. చటుక్కున ఆమె అందుకుని ఉఫ్—అని ఊది మంటనార్పి భర్త ముఖంలోకి చూచింది.

"మునల్లయిపోయిందే అది నాలెక్కనే"అన్నాడు గంభీరంగా.

"సరేగనీ. ఎంతయిందో యిప్పుడు. ఎనమిదైందా. తొమ్మిదింటికి గాడున్నదట గద. పెద్దోడత్తడు దాంట్ల. యాదికున్నదా."

"ఉన్నది ఉన్నది. వాండ్లకోసమే బతుకుతానం— వాండ్ల సంగతే అప్పట్నుంచి ఆలోచిత్తాన. యింతమంది పిల్లలను కంటిమి. పెంచితిమి. పెద్దజేస్తిమి—పెండ్లీళ్ళు జేస్తిమి. ఎక్కడోళ్ళక్కడ ఉద్యోగాలు ఎదుక్కుంట పోయిరి. ఆకర్కి మళ్ళ మనమే మిగిల్తిమి గదనే లచ్చవ్వా..చిత్రంగనిపిస్తదీ బతుకు ఒక్కోసారి."

"సరేగనీ. చాన్నాల్లయింది పెద్దోన్నిచూచి. మొన్న టుత్తరం యిన్నవా నువ్వు. పట్నం నుంచి యిమానంల మదరాసు పోయి రైలుల రాంగిటత్తనన్నడు. పిల్లలెంతెదిగి పోయిండ్లు సూడు. కూలిపని చేసి మనం పెంచిన పోరగాండ్లు గిట్లయిండ్లండే సంబరమైద్ది."

కనకయ్య ఆమె ముఖంలోకి చూస్తున్నాడు నిశ్శ బ్దంగా. ఆమె కళ్ళలో పల్చటి నీటిపొర కదలడం అతనికి కనిపించింది. తనకు తెలియకుండానే ఆమె తలపై చేయివేసి వెండి వెంట్రుకలను నిమురుతూ ఉండ పోయాడు.

బయట వర్షం కురుస్తూనే ఉంది.

* * * * * * * *

ఆటో ఆగిన చప్పుడైతే...లక్ష్మి లేవబోయింది ఉత్సాహంగా. రాబోయే కొడుకుని చూడాలని ఎంతో ఆతురతగా ఉందామెకు.

"నువ్వుకూకో—నేజూత్త"అని కనకయ్య లేస్తూం డగానే చటుక్కున కరెంటు పోయింది..."అరె దీన వ్వ. యిదిప్పుడే పాయె..."విసుక్కుంటూ లాంతరు నందుకుని వత్తి పెద్దదిచేసి..నాల్గడుగులు నడిచి, తలుపు తెరిచి—

వీధిలో—ఆటో దిగుతున్నాడు పెద్దోడు.

"దాదా వచ్చిండు.."

ఆమెకూడా పొంగివచ్చే ప్రేమతో వచ్చి—

చేతిలో సూట్ కేస్‌తో, పొట్లాలతో అతను లోపలి కొస్తూ, "యింక పడుకోలేదా నాన్నా...అరె కరెంటు పోయినట్టుందే.."అంటూంటే,

"ఏం పంటదిరా మీ అమ్మ. కొడుకస్తాండంటె



సాలు కొండంత సంబరమాయె. బువ్వకూడా తిన కుండ నీకోసమే ఎదిరిసూత్తాంది పొద్దట్నుంచి..పా.. అంత బాగున్నారా బిడ్డ. పిల్లలుగిట్ల.."

"ఆ...ఎట్లున్నవమ్మా..బక్క బడ్డట్టనిపిస్తానవే.."

సూట్ కేస్ తెరుస్తూండగానే భళ్ళుమని కరెంటొచ్చి వెలుగొచ్చింది. రెండు ప్యాకెట్లలోనుంచి నాన్నకూ, అమ్మకూ బట్టలు తీసి, తెచ్చిన పళ్ళు ముందరుంచి.."నాన్నా నీకీ ధోతి బాగుంటది. అమ్మకు ప్రత్యేకంగాఈచీరకొన్న మద్రాస్‌లో..సూడమ్మా.."

వృద్ధులిద్దరి కళ్ళలో నీళ్ళూరుతున్నాయి.

"ఎందుకు బిడ్డా మాకీవన్నీ. ఉండనే ఉండె బోలెడన్ని మీరు తెచ్చినవె...నువ్వు కాళ్ళు కడుక్కొని భోంచేయిర.. లే నాయ్న.."

భిక్షపతి లేచి బట్టలు మార్చుకుని..పళ్ళెం ముందు కూర్చున్నాడు. తల్లి వడ్డిస్తోంది ప్రేమగా. ఓసారి యింటినంతా కలియజూశాడు..జ్ఞాపకాల్లో చిక్కిపోతూ. పుట్టి, పెరిగి..ఓ సామాన్య కూలీకుటుంబంనుండి ఒక ఫస్ట్ రాంక్ ఇంజనీర్‌గా తను రూపుదిద్దుకున్న మందిర మది. ఎన్నిస్మృతులు.. ఎన్నిమమతలు..అన్నదమ్ములు ..అక్కచెల్లెండ్లు...ఎంత ప్రేమ. హృదయం గాలిలో ఊగిపోయే చిగురుటాకులా పరవశించిపోతోంది.

"మొకమంత గుంజకపోయింది బిడ్డ...ఎప్పుడు బయల్దేరినార.."తల్లి.

తలెత్తాడు భిక్షపతి. ఎందుకో కళ్ళనిండా నీళ్ళు పొంగినై.

"అమ్మా...మేమందరం..గింతమంది కొడుకులం పెద్ద పెద్దోళ్ళమై ఉండగా మీరింకా పనిచేస్తూ ఎందుకే కష్టపడతారు. వచ్చి మా దగ్గరుండే పోలేదానె. లోకం కూడ ఏమంటది. గాడ్దికొడుకులు తాము హాయిగుండి ఏ ఒక్కడూ తల్లిదండ్రులను పట్టించుకుంటలేరను కోరా. అమ్మ పుట్టినప్పట్నుంచి బీడీలు చేస్తాందె. నాయిన మిల్లుల పనిచేసి పనిచేసి బొక్కలు తెల్లబడె.. మాలో ఏ ఒక్కరి దగ్గరున్నా పోయె.."

కనకయ్య భార్య ముఖంలోకి చూశాడు దీనంగా. మాట మార్చాలన్న ఉద్దేశ్యంతో "రెండ్రోజులుంట వార" అన్నాడు.

"పోవాల పొద్దుగాల ఆరుగంటల బండికి. ఎగ్జిక్యూటివ్స్ మీటింగుంది. ఈనాలుగ్గంటలే ఉందుడు"

"అయ్యో ఏం ఉజ్జోగంరా. ఎప్పుడూ పనే–గడియ రికాంలేదు"

"తప్పదే అమ్మా..పోనీగని చెప్పరూ యిప్పుడు నేనడిగింది మీ రిద్దరు నాతో వస్తరా—"

"నువ్వు బువ్వ తిన్రా ముందుగ"

"ఈ వయసుల కాలునొచ్చె, కన్ను నొచ్చె.. మేం దగ్గరుంటె మంచిగుంటది"

కనకయ్య యిక తప్పదనుకున్నాడు. "వద్దుబిడ్డ. మనుషుల నడుమ దూరముంటేనే ప్రేమలుంటై.. సచ్చెదాన్క పనిజెయ్యాలె మనిషి. కష్టపడ్డ చేతులు ఉట్టికే ఉండమంటే ఎటూ పొద్దుపోదు. బతుకంత మాకుమేం బతికినం. మిమ్మల్ని కండ్లల్ల పాపలోల్లె సాదుకున్నం. యిగ ఈ మిగిలిన బతుక్కూడ సొంతగనే బతుకుతె సంతోసం. గంతె ఎవరికీ బరువుకావద్దు మేము. మేమిక్కడుండే రెండు ముఖ్యమైన సంగతులున్నాయి..."చెప్పుకుపోతున్నాడు కనకయ్య గంభీరంగా, ధృడంగా.

భిక్షపతి తండ్రి యొక్క సమగ్రమైన వ్యక్తిత్వాన్ని సందర్శిస్తున్నాడు. చదువుకూ, సంస్కారానికీ అసలే సంబంధం లేదా అనిపిస్తోందతనికి.


"గా మాదిగ ఎంకటయ్య కొడుకు.. సూరిగాడు. వాళ్ల కులంకోట కింద డాకటర్ సదివిండు. బస్ డాక్టరైపోంగనే తను పుట్టిపెరిగిన కులపోళ్ళ మొకం సూడకుండ పెద్దోడై పట్నంల్నే ఉన్నడు. చెట్టు పెద్దదే—కని తను పుట్టిన నేలను మరిచిపోతె ఎట్లబిడ్డ. మీరుకూడ జీవితంల గాడితప్పకుండుండాల్నంటె మీ చిన్నతనం యాదుండాలె. అవన్ని యాదుండాల్నంటె యిగో మేం యిక్కడ్నే యీ పాతింట్లోనే ఉండాలె. అదీగాకబతుకంతా యీయింట్లోనే గడిచె. దీన్నిడ్చి పెట్టి రాము కొడుక. ముందగనే చెప్పినట్టు మనుషులు దూరముంటేనే ప్రేమలుంటై. ఐపోయె.. పండుటాకులం. మీరు సుకంగుంటె సాలు..గంతే.."

ఇంజనీర్ భిక్షపతి మౌనంగా తల్లిదండ్రుల ముఖంలోకి చూస్తున్నాడు. అతనికి తల్లి ముఖంగానీ, తండ్రి ముఖంగానీ కనిపించడం లేదు. కళ్ళనిండా నీళ్ళే.

కన్నీళ్ళు టపటపా జారి మకిలిపట్టిన లాంతరు ముందు పడుతున్నాయి — అగ్నిబిందువుల్లా.

---

# శకునాలు



దాదాపు సంవత్సరం క్రితంనేనూ మా వారూ మా సంవత్సరం పాపతో బంధువులింట్లో గృహ ప్రవేశానికి బయల్దేరాం. మా ఊరికి కొంచెం దూరం అవటం వల్ల, తెల్లవారితే వాళ్లింట్లో గృహ ప్రవేశం అవటం వల్లనూ, రాత్రికి అక్కడకు చేరుకోవచ్చనే ఉద్దేశంతో మధ్యాహ్నం 3 గం.లకే మోటార్ సైకిల్‌పై బయల్దేరాం. మోటార్ సైకిల్ స్టార్ట్ చేస్తూ ఉండగా చాకలి శుభ్రంగా ఉతికిన బట్టల మూటతో ఎదురు వస్తూ కనిపించింది.

విడచిన బట్టల మూట ఎదురు వస్తే ఎంతో శుభమని, ఉతికిన బట్టలటూట ఎదురు వస్తే అశుభమని ఎక్కడో విన్న నాకు ఒక్క క్షణం ఆగివెళ్తే బాగుండు అన్పించింది. కాని శకునాల మీద అంతగా నమ్మకంలేని మేము ఆగకుండా బయల్దేరాం. కాని కొంచెందూరం వెళ్లేటప్పటికి ఒక గడ్డి బండి ఎదురు రావడం, దాని పక్కనుండి పోవడానికి ఒక గుంటలో నుండి పోనివ్వడం, నేను మా పాపతో సహా క్రింద పడటం అంతా సెకండ్స్‌లో జరిగిపోయింది. స్వల్ప గాయాలతోనే బయటపడ్డామనుకోండి. నా ఒళ్ళో ఉన్న పాపకు కొంచెం కూడా దెబ్బలు తగులకుండా నేను కొంచెం గాయలతో బయట పడటం చాలా అదృష్టమనే చెప్పాలి. ఆ సంగతి తలచుకుంటే ఇప్పటికీ ఎంతో భయమేస్తుంది. అప్పటినుండి నాకు శకునాల మీద నమ్మకం ఏర్పడింది. ఆ శకునం స్వతఃసిద్ధంగా ఏర్పడినది కావడం, పైగా అది మాకు ఎడం ప్రక్క నుండి పోవడంతో మాకు ఆ ఏక్సిడెంట్ జరిగిందని నేనిప్పటికీ నమ్ముతాను.

శకునాలను తేలిగ్గా కొట్టి పారేసే నాకు ఆరోజు నుండి వాటిమీద బలమైన నమ్మకం ఏర్పడింది.

బి.సంధ్య

తిరుపతి

---

